

**2 లో**

## ఉత్తమ విద్యార్థులకు శ్రీరామ్ గ్రూప్ చేయూత..!


# సంగారెడ్డి మెదక్

శనివారం 26 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:06


# ఘనంగా గణనాథుడి నిమజ్జన శోభాయాత్ర



## – కాంగ్రెస్ నాయకుడు కారుపోతుల మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు

**అమీన్‌పూర్(ప్రజాజ్యోతి)**

గణనాథుడి నిమజ్జన శోభాయాత్ర శ్రీ వాణి నగర్‌లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో, కోలాహలంగా సాగింది. అమీన్‌పూర్ సీఎంసీ సర్కిల్ పరిధిలోని శ్రీ వాణి నగర్ కాలనీలో కాంగ్రెస్ నాయకుడు కారుబోతుల మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమానికి కాలనీవాసులు భారీగా తరలివచ్చారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రారంభమైన శోభాయాత్రలో చిన్నారులు, మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. మిగతా 2 లో





# రక్తదానంతో సేవా స్ఫూర్తి

## - ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల సందర్భంగా వట్పల్లిలో మెగా రక్తదాన శిబిరం



**వట్పల్లి, ప్రజాజ్యోతి సెప్టెంబర్ 25:**

భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల సందర్భంగా వట్పల్లి మండల కేంద్రంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక ఇబ్బందులు పడుతున్న వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ శిబిరానికి పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా నాయకుడు పట్లోళ్ల అరవింద్ పాటిల్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని అన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు వచ్చి సామాజిక బాధ్యతను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగదీశ్వర్ పాటిల్ హాజరయ్యారు. బీజేపీ వట్పల్లి మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, రేగోడు మండల అధ్యక్షుడు సంగమేశ్వర్, అల్లాదుర్గ్ మండల అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, బీజేపీ వట్పల్లి మండల ఉపాధ్యక్షుడు వెంకట్రావు మహారాజ్, జనరల్ సెక్రటరీ యాదయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రధాని జన్మదిన వేడుకలను కేవలం ఉత్సవాలకే పరిమితం చేయకుండా రక్తదానం వంటి సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా ప్రజల్లో సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించామని నిర్వాహకులు తెలిపారు.

# ఘనంగా గణనాథుడి నిమజ్జన శోభాయాత్ర

మొదటిపేజీ తరువాయి

### సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన చిన్నారులు

వినాయక నిమజ్జన శోభాయాత్రలో చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు చేసిన నృత్యాలు, ప్రదర్శనలు కాలనీవాసులను ఆకట్టుకున్నాయి. మహిళలు కోలాటాలతో భక్తి, ఉత్సాహాన్ని చాటుకున్నారు. యువకులు డీజే పాటలకు నృత్యాలు చేస్తూ శోభాయాత్రలో సందడి చేశారు. గణనాథుడి నామస్మరణలు, భక్తిగీతాలతో శ్రీ వాణి నగర్ వీధులు మార్మోగాయి.



### లడ్డూ వేలంలో భారీ పోటీ

వినాయకుడి ప్రసాదంగా నిర్వహించిన లడ్డూ వేలం కార్యక్రమం కూడా ఉత్సాహంగా సాగింది. గణేష్ లడ్డూలో మొదటి లడ్డూను రూ.5.50 లక్షలకు తిరుపతి రాథోడ్ దక్కించుకున్నారు. రెండో లడ్డూను మహిళలకు కేటాయించగా, రూ.2 లక్షలకు కారుపోతుల మమత మహేష్ గౌడ్ దక్కించుకున్నారు. లడ్డూ వేలం సందర్భంగా కాలనీవాసులు ఉత్సాహంగా పాల్గొని వేలాన్ని విజయవంతం చేశారు.



### ప్రతి ఏటా ఘనంగా గణనాథుడి ఏర్పాటు

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు కారుపోతుల మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. శ్రీ వాణి నగర్‌లో ప్రతి ఏటా గణనాథుడిని ఘనంగా ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తామని తెలిపారు. గణనాథుడి ఆశీస్సులతో కాలనీవాసులు, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. కాలనీవాసుల సహకారంతో వినాయక ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం గణనాథుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఏర్పాటు చేసి భక్తుల నామస్మరణల మధ్య నిమజ్జనానికి తరలించారు. శోభాయాత్రలో మహిళలు, యువకులు, చిన్నారులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తిశ్రద్ధల మధ్య గణనాథుడి నిమజ్జన కార్యక్రమం ముగిసింది.

# ఉత్తమ విద్యార్థులకు శ్రీరామ్ గ్రూప్ చేయూత..!

## - ప్రభుత్వ విద్యకు నగదు ప్రోత్సాహం

మొదటిపేజీ తరువాయి

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

పేదరికాన్ని జయించి విద్యలో ప్రతిభ కనబరిచిన జిల్లా పరిషత్తు హై స్కూల్ మల్కాపూర్, కొండాపూర్ మండలం కు చెందిన విద్యార్థిని ఎ. వర్షిత కి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని అందించింది. ఇటీవల నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి 10 వ తరగతి పరీక్షలో 594 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచింది. ఆమెతో పాటు మరో విద్యార్థిని కె. మౌనిక కూడా 592 మార్కులు సాధించగా.. రూ.3 లక్షల ప్రోత్సాహకాన్ని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రకటించింది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ తరపున ఈ నగదు ప్రోత్సాహకాలను గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల అందజేశారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి కష్టపడి చదివి విజయం సాధించిన విద్యార్థులను శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో మరింత కృషి చేసి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ క్యాషి, శ్రీరామ్ ఫైనాన్స్ ఎం డి ప్రవీణ్ ,శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఇండియా మార్కెటింగ్ మేనేజర్ వరుణ్ కిషోర్, శ్రీరామ్ లైఫ్ తెలంగాణ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి, హైదరాబాద్ జోనల్ మేనేజర్ నరేందర్ , సంగారెడ్డి డివిజన్ ఏజీఎం విజయ్ , బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ , స్థానిక మల్కాపూర్ పాఠశాల హెడ్మాస్టర్ యాదగిరి , ఉపసర్పంచ్ ప్రవీణ్ పాల్గొన్నారు.



# సోషల్ మీడియా ఫేమ్ కోసం ఫేక్ లేఖలు..

## - ఇద్దరు యువకులకు రిమాండ్

## - మావోయిస్టుల పేరుతో లేఖలు.. అసలు కథ బయటపెట్టిన పోలీసులు

**తూప్రాన్ (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 25:**

తూప్రాన్‌లో ఎర్రజెండాలు, మావోయిస్టుల పేరుతో వెలువడిన లేఖల వ్యవహారానికి పోలీసులు తెరదించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఎర్రజెండాలు ఏర్పాటు చేయడంతో పాటు మావోయిస్టుల పేరుతో లేఖలను ప్రచారంలోకి తీసుకువచ్చిన ఘటన వెనుక ఇద్దరు యువకులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సోషల్ మీడియాలో ఫేమ్, వ్యూస్ పెంచుకోవడమే లక్ష్యంగా ఈ వ్యవహారానికి తెరలేపినట్లు పోలీసుల విచారణలో






వెల్లడైంది.నాగులపల్లి గ్రామానికి చెందిన బండ మధు, చింతకింది శ్రీధర్ ఈ కేసులో నిందితులుగా గుర్తించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు.తూప్రాన్ పోలీస్ స్టేషన్, మున్సిపల్ కార్యాలయం వద్ద ఎర్రజెండాలు కనిపించడంతో పాటు మావోయిస్టుల పేరుతో లేఖలు వెలుగులోకి రావడంతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఘటనకు సంబంధించిన సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించడంతో పాటు సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తూ నిందితుల కదలికలను గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు.విచారణలో భాగంగా నిందితులు ఉపయోగించిన రెండు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో కంటెంట్ రూపొందించే అలవాటు ఉన్న వీరు.. మరింత మంది దృష్టిని ఆకర్షించేందుకు మావోయిస్టుల పేరును ఉపయోగించినట్లు పోలీసులు తెలిపారు.'ఏపీటీఎచ్అలెగ్జాండర్ తెలంగాణ పీపుల్స్ హిస్టరీ' పేరుతో లేఖలు రూపొందించి ప్రచారం చేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఛత్తీస్‌గఢ్‌కు సంబంధించిన మావోయిస్టు కేసులో పది మందికి ఉరిశిక్ష విధించిన అంశాన్ని కూడా లేఖల్లో ప్రస్తావించినట్లు ఎస్పీ పేర్కొన్నారు.అయితే అరెస్టయిన యువకులకు మావోయిస్టు సంస్థలతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్పీ స్పష్టం చేశారు. గతంలో మేడారంలో ముఖ్యమంత్రి కార్యక్రమం సందర్భంగా కూడా వీరు ఎర్రజెండాలు ఏర్పాటు చేసినట్లు విచారణలో గుర్తించినట్లు తెలిపారు.కేసు దర్యాప్తును వేగంగా పూర్తి చేసిన పోలీసులు ఇద్దరినీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఘటన వెనుక వాస్తవాలను వెలికితీయడంలో కీలకంగా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, ఎస్ఐ గంగారాజు తదితరులు పాల్గొన్నారు.

---

# కొండాపూర్ పోలీస్‌స్టేషన్ నుంచే పరారైన పాత నేరస్తుడి అరెస్ట్!



## - ఫింగర్‌ప్రింట్ ఆధారంగా గుర్తింపు.. గాలింపు అనంతరం పట్టుకున్న పోలీసులు

## - బీదర్ గమ్మతాండలోని రేకుల షెడ్డులో గురువారం సాయంత్రం అదుపులోకి...

## - కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలింపు..

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

దొంగతనం కేసులో విచారణ నిమిత్తం కొండాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చిన పాత నేరస్తుడు పోలీసుల కళ్లుగప్పి స్టేషన్ నుంచే పరారైన ఘటనలో పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఫింగర్‌ప్రింట్ ఆధారంగా గుర్తించిన నిందితుడు వనావత్ అనిల్‌ను పోలీసులు విస్తృతంగా గాలించి అదుపులోకి తీసుకున్నారు.దొంగతనం జరిగిన ప్రాంతంలో లభించిన ఫింగర్‌ప్రింట్ ఆధారాలను పోలీసులు పరిశీలించగా, అవి గతంలో నేరచరిత్ర కలిగిన వనావత్ అనిల్ వేలిముద్రలతో సరిపోలినట్లు గుర్తించారు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం కొండాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు.అయితే విచారణ సమయంలో పోలీసుల దృష్టిని మళ్లించి అనిల్ పోలీస్‌స్టేషన్ నుంచి తప్పించుకున్నాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం బీదర్ గమ్మతాండ గ్రామ పరిధిలోని ఓ రేకుల షెడ్డులో ఉన్న నిందితుడు వనావత్ అనిల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.అనంతరం అతడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం రిమాండ్ విధించడంతో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

**ఎస్ఐ సోమేశ్వరి మాట్లాడుతూ..**

కొండాపూర్ ఎస్ఐ సోమేశ్వరి మాట్లాడుతూ.. దొంగతనం కేసులో లభించిన ఫింగర్‌ప్రింట్ ఆధారంగా అనుమానితుడిని గుర్తించి విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో అతడు పోలీస్‌స్టేషన్ నుంచి పరారైనట్లు పేర్కొన్నారు.వెంటనే అప్రమత్తమైన పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టి బీదర్ గమ్మతాండ గ్రామ పరిధిలోని రేకుల షెడ్డులో వనావత్ అనిల్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం అతడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.ఫింగర్‌ప్రింట్ ఆధారంగా దొంగతనం కేసు దర్యాప్తులో కీలక పురోగతి సాధించిన పోలీసులు, స్టేషన్ నుంచి పరారైన నిందితుడిని తిరిగి పట్టుకుని రిమాండ్‌కు తరలించడంతో ఘటనకు ముగింపు పలికారు.

# మల్లెపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన అధికారులు

## - విద్యార్థులతో కలిసి భోజనం చేసిన తహసీల్దార్ అశోక్.

## - ఆహారం, బోధన, పాఠశాల సౌకర్యాలపై పరిశీలన

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మండల పరిధిలోని మల్లెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల విద్యాధికారి బెల్జావత్, మల్లెపల్లి సర్పంచ్ ఏ. భావన బలవంత్ రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నిఖిల్, జీపీఓ రాఘవేందర్‌లతో కలిసి తహసీల్దార్ అశోక్ సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అశోక్ పాఠశాలలోని వివిధ సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించడంతో పాటు, వారితో కలిసి భోజనం చేశారు.



**తహసీల్దార్ అశోక్ మాట్లాడుతూ..**

పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న ఆహారం, బోధన తదితర అంశాలపై వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నామని తహసీల్దార్ అశోక్ తెలిపారు. విద్యార్థుల నుంచి పాఠశాలలోని సౌకర్యాలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలోని మరుగుదొడ్లు, తరగతి గదులు మంచి స్థితిలో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పోషణతోనే ఆరోగ్యకర భవిష్యత్తు

## - అందోల్‌లో 9వ పోషణ మాసం..

## -సామూహిక సీమంతాలు, అన్నప్రాసన, అక్షరాభ్యాసం

**అందోల్, సెప్టెంబర్ 25, (ప్రజాజ్యోతి):**

తల్లి ఆరోగ్యం.. శిశువు సంక్షేమం.. బాలల సంపూర్ణ వికాసమే లక్ష్యంగా అందోల్ మండల కేంద్రంలో 9వ పోషణ మాసం కార్యక్రమాన్ని శుక్రవారం







ఘనంగా నిర్వహించారు. పోషకాహారం, తల్లీబిడ్డల ఆరోగ్యం, బాలల ప్రాథమిక విద్యపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహించారు. పోషణ మాసం సందర్భంగా సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం వంటి కార్యక్రమాలు చేపట్టారు. తల్లులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని, గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవాలని కార్యక్రమంలో సూచించారు. చిన్నారుల ఎదుగుదలలో తొలి దశలోనే సరైన పోషకాహారం అందించడం కీలకమని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. పోషకాహార లోపాన్ని నివారించడంతో పాటు పిల్లల్లో ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవసరమైన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ మధులిక, సూపర్వైజర్లు సంగీత, అమృత వాణి, కోఆర్డినేటర్ విద్య, బ్లాక్ కోఆర్డినేటర్ రమేష్, ఎంపీడీఓ రమేష్, ఏపీఎం దేవేందర్, మెడికల్ ఆఫీసర్ శంకర్ నాయక్‌తో పాటు మండల పరిధిలోని అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# మేడికుంద గ్రామంలో డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డ్ పంపిణి

**వట్పల్లి ప్రజా జ్యోతి సెప్టెంబర్ 25**

వట్పల్లి మండలం మేడికుంద గ్రామంలో శుక్రవారం రోజు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కొత్త డిజిటల్ రేషన్ కార్డ్స్ లబ్ధిదారులకు సర్పంచ్ చంద్రకళ చేతుల మీదుగా పంపిణి చేశారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ గౌరవనీయులైన మంత్రి దామోదర్ రాజనర్సింహా గారి ఆదేశానుసారం అర్హులైన ప్రతిఒక్క పేదలకు ఆకలితో అలమటించకూడదని, సన్న బియ్యం తో పిల్లలు, పెద్దలు కడుపునిండా తినాలని ఉద్దేశంతో పంపిణి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ ఆహార భద్రత కార్డ్ పైననే ప్రతీ సంక్షేమ పథకం ఆధార పడునని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు, గ్రామ కార్యదర్శి చరణ్ రాజ్, ఉపసర్పంచ్ నిర్మల నాగయ్య, వార్డ్ సభ్యులు పోచయ్య , విష్ణు, సురేష్, ప్రేమల, స్వరూప, ప్రభు, డీలర్ ఏర్పుల బేతయ్య మరియు నాయకులు బగిలి వీరప్ప, ప్రవీణ్ గౌడ్, బక్కన్న, శ్రీశైలం, పల్లె క్రిష్ణ , విట్టల్, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ ఎస్ఐఆర్ నోటీసులను త్వరితగతిన పూర్తి చేయాలి

## - బీఎల్ఓలు, సూపర్‌వైజర్లకు

## మున్సిపల్ కమిషనర్ వి. ప్రశాంతి ఆదేశం

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 25:**

పెండింగ్‌లో ఉన్న ఎస్ఐఆర్ నోటీసుల జారీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, ఎలాంటి పెండింగ్ లేకుండా చర్యలు చేపట్టాలని నారాయణఖేడ్ మున్సిపల్ కమిషనర్ వి. ప్రశాంతి బీఎల్ఓలు, సూపర్‌వైజర్లను ఆదేశించారు. శుక్రవారం నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో ఎస్ఐఆర్ నోటీసుల జారీ ప్రక్రియపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు..ఇప్పటివరకు జారీ చేసిన ఎస్ఐఆర్ నోటీసుల వివరాలతో పాటు ఇంకా జారీ చేయాల్సిన పెండింగ్ నోటీసులు, వాటి





పురోగతిని సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న నోటీసులను వేగవంతంగా జారీ చేసి, సంబంధిత వివరాలను సకాలంలో సమర్పించాలని సూచించారు. నోటీసుల జారీ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. నిర్ణీత గడువులోగా ఎస్ఐఆర్ నోటీసుల జారీ ప్రక్రియను పూర్తి చేసి, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.68 వేలకు గణపయ్య లడ్డూ!

## - పోటాపోటీగా సాగిన వేలం..

## - లడ్డూను దక్కించుకున్న గౌడు చర్ల హనుమంతు

**అందోల్, సెప్టెంబర్ 25, (ప్రజాజ్యోతి):**

వినాయక నవరాత్రి ఉత్సవాలకు ముగింపు పలుకుతూ నాదులాపూర్ గ్రామంలో నిర్వహించిన వినాయక నిమజ్జన మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా సాగింది. నిమజ్జనోత్సవంలో భాగంగా నిర్వహించిన గణపయ్య లడ్డూ వేలం పాట ఉత్కంఠగా సాగింది. గ్రామస్థులు, భక్తులు పోటాపోటీగా వేలంలో పాల్గొనగా చివరకు గౌడు చర్ల హనుమంతు రూ.68 వేలతో గణపయ్య ప్రసాదాన్ని దక్కించు కున్నారు. వేలంపాటలో గణపయ్య లడ్డు సాధించిన హనుమంతు మాట్లాడుతూ.. గణపయ్య అనుగ్రహంతోనే లడ్డూ తనకు దక్కిందని, దీనిని ఎంతో పవిత్రంగా భావిస్తున్నానని తెలిపారు. వేలం సందర్భంగా భక్తుల్లో ఉత్సాహం నెలకొంది. లడ్డూను దక్కించుకోవడాన్ని భక్తులు గణపయ్య ఆశీస్సులకు ప్రతీకగా భావించారు. అనంతరం గణపయ్య లడ్డూను దక్కించుకున్న గౌడు చర్ల హనుమంతును నాదులాపూర్ హనుమాన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఆయనను అభినందించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలం గ్రామంలో భక్తి, ఐక్యతతో పాటు ఉత్సాహాన్ని నింపింది. నిమజ్జనోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై గణపయ్యకు వీడ్కోలు పలికారు.



# ఆధ్యాత్మిక చింతనతోనే మనశ్శాంతి

## - భక్తిశ్రద్ధలతో భవాని సేవాలాల్ దీక్షలు.. బంజారా తండాల్లో ఆధ్యాత్మిక సందడి

**అందోల్, సెప్టెంబర్ 25, ప్రజాజ్యోతి:**

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, భక్తి మార్గం మనిషిలో క్రమశిక్షణతో పాటు సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తుందని







ఆల్ ఇండియా బంజారా లంబాడ శక్తిపీఠ్ జాతీయ సహ కార్యదర్శి విఠల్ మహారాజ్ అన్నారు. విజయదశమి, లలిత పంచమిని పురస్కరించుకొని బంజారా గిరిజనులు చేపట్టే 21 రోజుల భవాని సేవాలాల్ దీక్షా కార్యక్రమాలు పుల్కల్ మండలం విట్టల్ నాయక్ తండాలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విఠల్ మహారాజ్ గిరిజనులకు మాలధారణ చేయించారు. నాగల్‌గిద్ద మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజు రాథోడ్ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టిన మహారాజులకు ప్రత్యేక వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం భక్తులను ఉద్దేశించి విఠల్ మహారాజ్ మాట్లాడుతూ.. దీక్షా వ్రతం ద్వారా ఆధ్యాత్మిక భావనలు పెంపొందడంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. భక్తి, నియమ నిష్ఠలతో జీవించడం ద్వారా వ్యక్తుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెరుగుతాయని పేర్కొన్నారు. బంజారా సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేందుకు బాల బ్రహ్మచారి జగద్గురు సంత్ తపస్వి రామ్‌రావ్ మహారాజ్ చేసిన కృషి, అందించిన ఆశీర్వాదాలు స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను కాపాడుకుంటూనే సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెంలోని భవాని మాత సేవాలాల్ మహారాజ్ ఆలయం వద్ద కూడా దీక్షలు చేపట్టిన వారికి వస్త్రాలను అందజేశారు. వివిధ తండాల నుంచి తరలివచ్చిన పూజారులు, దీక్షా మహారాజులు భక్తి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాగల్‌గిద్ద మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజు రాథోడ్, సంగారెడ్డి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి. గోవర్ధన్ నాయక్, గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు, బొమ్మారెడ్డిగూడెం సర్పంచ్ జైపాల్ నాయక్, దీక్షా మహారాజులు దేవిదాస్, శంకర్, ఈశ్వర్, పండరి, బాల్‌సింగ్, సురేందర్, మోహన్, జగదీష్, రాకేష్, సుభాష్, జీవవైవిధ్య పరిరక్షణ కమిటీ సభ్యుడు మూడ్ శివాజీ, జాదవ్ సంతోష్, రవీందర్ నాయక్ కార్బరి, వివిధ తండాల పూజారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి: ఏఈఓ

**కల్హేర్, సెప్టెంబర్ 25, ప్రజాజ్యోతి:**

రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ (రైతు గుర్తింపు కార్డు)లో తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని కిష్టాపూర్ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) సాయిలు సూచించారు. ఇప్పటివరకు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోని రైతులు వెంటనే నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.రైతులు ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్ తీసుకుని గ్రామ స్థాయిలో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈఓ)ను సంప్రదించి నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతులకు సంబంధించిన వివరాలు సక్రమంగా నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, సేవలు పొందేందుకు రిజిస్ట్రీ ఉపయోగపడుతుందని ఏఈఓ సాయిలు పేర్కొన్నారు.



# రూ.55 వేలకు గణేష్ లడ్డూ వేలం

**ఖానాపూర్ (కె), సెప్టెంబర్ 25 (ప్రజా జ్యోతి):**

కల్హేర్ మండలం ఖానాపూర్ (కె) గ్రామంలో భజరంగ్ దళ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద లడ్డూ వేలం ఉత్సాహంగా నిర్వహించారు. భక్తులు, గ్రామస్తుల సమక్షంలో జరిగిన వేలంలో వడిత్య దేవిసింగ్ రూ.55 వేల ధరకు లడ్డూను దక్కించుకున్నారు.లడ్డూను దక్కించుకున్న దేవిసింగ్‌ను నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ సాగర్, మాణిక్ ప్రభు, గుమ్మడి రాజుతో పాటు పలువురు గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



# ఊట్లలో వైభవంగా నిమజ్జనోత్సవం

## - కన్నుల పండువగా శోభాయాత్ర..

## కోలాటాలు, నృత్యాలతో సందడి

**జిన్నారం(ప్రజాజ్యోతి)**

జిన్నారం మున్సిపల్ పరిధిలోని ఊట్ల గ్రామంలో గణపతి నిమజ్జనోత్సవం గురువారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో మాజీ





ఉపసర్పంచ్ ప్రతాప్‌రెడ్డి రూ.76 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం లడ్డూను ఆయన కుమారుడు సుప్రీత్‌రెడ్డికి యువజన సంఘం సభ్యులు అందజేశారు.

**శోభాయాత్రలో జోష్..**

నిమజ్జనాన్ని పురస్కరించుకుని నిర్వహించిన శోభాయాత్ర గ్రామ పురవీధుల్లో కన్నుల పండువగా సాగింది. మహిళలు, చిన్నారులు కోలాటాలు, బతుకమ్మ పాటలతో సందడి చేయగా.. యువకులు డీజే పాటలకు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో కౌన్సిలర్లు బత్తుల మహేష్‌యాదవ్, బి.వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ గంగు రమేష్, మాజీ సర్పంచులు ఆంజనేయులు, గోవిందరాజు, మాజీ వార్డు సభ్యులు, గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో విఘ్నేశ్వరుని పూజలు.. వైభవంగా నిమజ్జనోత్సవం

**కల్హేర్, సెప్టెంబర్ 25 (ప్రజా జ్యోతి):**

సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండల కేంద్రంలోని మహంకాళి అమ్మవారి మందిరంలో వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం విఘ్నేశ్వరునికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన బాజ శ్రీనివాస్ దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.వినాయకుడి పాదపద్మాలకు భక్తులు వందనాలు సమర్పిస్తూ కుటుంబాల్లో





సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ప్రార్థించారు. విఘ్నేశ్వరుని కృప ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. "బాయ్ బాయ్ గణేశా.. మళ్లీ సంవత్సరం రావయ్య గణేశా" అంటూ భక్తులు భావోద్వేగంతో నినాదాలు చేశారు. తడుగురి సంగప్ప ఆధ్వర్యంలో కూడా విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఇదిలా ఉండగా కల్హేర్ మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ విగ్రహాల నిమజ్జనోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, భక్తి గీతాలు, నృత్యాలతో నిమజ్జన కార్యక్రమాలు సందడిగా సాగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా స్థానిక పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి నిమజ్జన కార్యక్రమాలను పర్యవేక్షించారు.